క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ. 5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పనులను నాణ్యతగా చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు బుజ్జయ్య, హన్మంతు, అంజిలయ్య, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

బాలికలు దృఢంగా ఉండాలి

కోయిల్‌కొండ: పాఠశాలలో చదువుతున్న బాలికలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని ఎంఈఓ వెంకటాజీ అన్నారు. సోమవారం స్థానిక ఉన్నతపాఠశాలలో బాలికల సాధికారికత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కోత్లాబాద్ పీహెచ్‌సీ డాక్టర్ సంగీత, భీరయ్య హాజరై బాలికలు తీసుకునే ఆహారం వంటి పలు విషయాలను ఎలా మెరుగుపరుచుకోవాలని వారు సూచించారు. సైబర్ నేరాలకు, ఆకతాయిలకు ఎలా జాగ్రత్తపడాలో హెడ్‌కానిస్టేబుల్ సుజాత విద్యార్థులకు వివరించారు. ఏఎస్‌ఎం అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణకు ఘన నివాళి

అడ్డాకుల: 20 ఏళ్ల క్రితం నక్సల్స్ కాల్పుల్లో అమరుడైన ఎంపీపీ కందూర్ నారాయణ వర్ధంతిని అడ్డాకులలో సోమవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, విండో చైర్మన్‌గా కందూర్ నారాయణ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. భీమన్నయాదవ్, భీంరెడ్డి, ఖాజామొయినోద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, బుచ్చన్నయాదవ్, నర్సింహ్మా, కుర్మన్న తదితరులు ఉన్నారు.

శివప్రసాద్‌యాదవ్‌కు డాక్టరేట్

మహబూబ్‌నగర్ రూరల్: రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన టంకరి శివప్రసాద్‌యాదవ్‌కు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. తమిళనాడు రాష్ట్రంలోని ఊటీలో గల హెచ్‌ఎడీపీ రీసోర్స్ సెంటర్ ఫర్ ట్రైబల్ కల్చర్‌హాల్‌లో సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. శివప్రసాద్ సహాయ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో దాదాపుగా ఐదువేల మందికి పైగా రక్త, తెల్లరక్త కణాల, ప్లాస్మా దానాలు, మరెన్నో సేవా కార్యక్రమాలు చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడినాడు. ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గుర్తించి డాక్టరేట్ అందించింది.

నిబంధనలు పాటించండి



నవాబుపేట: విద్యా బోధన విషయంలో ఉపాధ్యాయులు తగు నిబంధనలు పాటించాలని ఎంఈఓ నాగ్యనాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు ప్రత్యేక బోధన విషయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బోధనాంశాలు వారికి వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నూతన విధానం ద్వారా బోధన చేస్తున్న వివరాలు పొందుపర్చాలని సూచించారు. తాజాగా పాఠశాలలో కొనసాగుతున్న టాంజరిన్ యాప్‌పై అవగాహన కల్పించారు.

ఆస్పత్రికి అంటూ వెళ్లి మహిళ అదృశ్యం

జడ్చర్ల: ఆరోగ్యం బాలేదు ఆస్పత్రికి వెళ్లి వస్తానంటూ వెళ్లిన భార్య తిరిగి రాలేదంటూ భర్త మహేశ్వర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలు.. దేవరకద్ర మండలం జీనుగురాలకి చెందిన మహేశ్వర్‌రెడ్డి తన రెండో భార్య అనిత(33)తో కలిసి బతుకుదెరువు కోసం నాలుగేళ్ల క్రితం జడ్చర్లకు వచ్చాడు. ఇక్కడే ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 7న అనిత ఆరోగ్యం బాలేదని, ఆస్పత్రికి పోయి వస్తానని చెప్పి వెళ్లింది. అలా వెళ్లిన ఆమె ఎంతకీ తిరిగిరాలేదు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో భర్త మహేశ్వర్‌రెడ్డి సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యాభివృద్ధి, మౌలిక వసతులకే ఖర్చు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- 'విద్యా నిధి'కి మైహోం గ్రూప్ రూ.10లక్షలు విరాళం
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అందజేత



కలెక్టర్ విజయేందిర బోయికి రూ.10లక్షల చెక్కును అందజేస్తున్న మైహోం ప్రతినిధి శ్రీనివాస్ చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ విద్యా నిధికి వచ్చే విరాళాలను విద్యాభివృద్ధికి, పాఠశాల, కళాశాలల్లో మౌలిక వసతులకు ఖర్చు చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఎమ్మెల్యే యెన్నం ఆధ్వర్యంలో కలెక్టర్ విజయేందిర బోయికి మైహోం గ్రూప్స్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ రూ.10లక్షల చెక్కు విద్యా నిధికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా వాసి, ప్రముఖులు మైహోం అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు వారి కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ విద్యా నిధికి రూ.10లక్షల చెక్కును అందించారన్నారు. రానున్న నాలుగేళ్లలో పది కోట్ల రూపాయలను విద్యా నిధికి సమకూర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేవారికి శిక్షణ తరగతులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, సీజే బెనహర్, మాజీ కౌన్సిలర్ శంకర్, ప్రవీణ్‌కుమార్, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

స్టేషన్ మహబూబ్‌నగర్: అల్ మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ సేవలు విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అల్ మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న జీకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలను సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి అల్ మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ అందిస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, జీకే ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాల వల్ల ఎందరో పేద విద్యార్థులకు నాణ్యమైన టెక్నికల్ విద్యను అభ్యసించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని అనుమతులు అధికారులను కలిసి చేయిస్తానని స్పష్టం చేశారు. టీజీఎంఎఫ్‌సీ మాజీ చైర్మన్, సెక్రెటరీ ఇంతియాజ్ ఇసాక్, సజ్జాద్, ముజఫర్‌అలీ, మహ్మద్ అహ్మద్, ఎంఎ.మన్నాన్, ప్రిన్సిపాల్ షబ్బీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- మీనుగోనిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



మీనుగోనుపల్లిలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర రూరల్: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మీనుగోనిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మీనుగోనిపల్లిని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి రూ.4.10 కోట్లతో 82 ఇళ్లు గ్రామంలోని పేదల కోసం కేటాయించినట్లు తెలిపారు. నాలుగు విడతలుగా ప్రభుత్వం ఇంటికి రూ.5 లక్షలు అందిస్తుందని అన్నారు. కేవలం ఇందిరమ్మ ఇళ్ల నమూననే కాకుండా స్వంతంగా నిర్మించుకునే లబ్ధిదారులు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. వీటితో పాటు 20 ట్రాక్టర్ల ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో వందశాతం ఆత్మీయ భరోసా అమలు చేశామని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వైద్యం భాస్కర్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్, మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే లక్ష్యం

చిన్నచింతకుంట: గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దమగ్నాపూరం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కోట్ల రూపాయలను ఖర్చుచేస్తూ సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కథలప్ప, కురుమూర్తిస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, అప్పంపల్లి సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు గంజి బాల్‌రాజు, వజీర్‌సాబ్, యాకూబ్, వట్టెం శివ తదితరులున్నారు.

చెట్లు నరకకుండా కాపాడాలని వినతి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో అభివృద్ధి పేరుతో ఇష్టం వచ్చినట్లు చెట్లను నరకుతున్నారని, అలా చెట్లను నరకకుండా చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్త(వనజీవి) రామానంద్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో భవన నిర్మాణం కోసం చట్టవిరుద్ధంగా వందలాది చెట్లను నరికివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లను కాపాడాలని ప్రజాప్రతినిధులు, అటవీ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. చెట్లను పరిరక్షించే భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

మహిళలు హక్కులు తెలుసుకోవాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమేష్ అన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మారుతున్న కాలంతో పాటు మహిళల ఆలోచనలో కూడా మార్పు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో డీఈ నవీన్, నిర్మల, సునీత, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై ఫిర్యాదు

రాజాపూర్ (బాలానగర్): బాలానగర్ మండలంలోని శేరిగూడగ్రామ శివారులోని రెడ్డికుంటలో కొందరు అక్రమంగా ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 52లో మటి తరలిస్తున్నారని సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి గ్రామస్తుడు నరేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అక్రమంగా మట్టిని తోడి రెడ్డికుంటలో గుంతలు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఓం నమఃశివాయ అంటూ నిప్పుల్లో నడక

- అగ్నిగుండంలో శివభక్తుల చిందులు

నవాబుపేట: ఓం నమఃశివాయ అంటూ నిప్పుల్లో నడక సాగించారు శివభక్తులు. కోటచింతల బసవేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం శివభక్తులు అగ్ని గుండంలో చిందులు వేసి నడిచి భక్తిని చాటుకున్నారు. మండలంలోని మరికల్ కోటచింతల దేవాలయంలో కొనసాగుతున్న ఉత్సవాల్లో బాగంగా అగ్నిగుండం కార్యక్రమం కొనసాగింది. మరికల్, కిష్టంపల్లి, బంగ్రంపల్లి, అగ్రహారం గ్రామాల ప్రజలు దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంమోహన్‌శర్మ, రాజేష్, సిద్దయ్య, నర్సింహారెడ్డి మాజీ సర్పంచ్‌లు పాండు, సత్యం, శివ, శేఖర్, అమర్‌నాథ్‌రెడ్డి, మధు, చరణ్, సరేందర్, చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సావిత్రీబాయికి ఘన నివాళి



మహబూబ్‌నగర్‌లో సావిత్రీబాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



గండేడ్ మండలం చిన్నవార్వాల్ పాఠశాలలో..



రాజాపూర్ ఉన్నత పాఠశాలలో..

సాక్షి నెట్‌వర్క్: మహిళలకు విద్యను అందించాలన్న చైతన్యమూర్తి సావిత్రీబాయి అని పలువురు వక్తలు కొనియాడారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సావిత్రీబాయి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తాలోని ఆమె విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, శివరాజ్, గణేష్, నరేందర్, రాము, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, చిట్యాల సుధాకర్, నిరంజన్ చారి, పాల సతీష్, లక్ష్మణ్, గణేష్ పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్‌లో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యంరాజు ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో సావిత్రీబాయి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆది విష్ణువర్ధన్, భాస్కర్, సురేష్, విజయ్, నరేష్, భగవంతు, అభి పాల్గొన్నారు.

■ మిడ్జిల్ మండలం వాడ్యాల్‌లో సావిత్రీబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయ్‌కుమార్, నర్సింహులు, సుకుమార్, భీంరాజ్, యాదయ్య,రాములు, మధు పాల్గొన్నారు.

■ గండేడ్ మండలంలోని చిన్నవార్వాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం బోరు కృష్ణయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

■ రాజాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు శాలువాలతో ఘనంగా సన్మించారు. ఎంఈఓ సుధాకర్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రావ్, ఉపాధ్యాయులు సరళ, రాధ, కవిత, గోపీకాంత్, ఎల్లయ్య, మోజెస్, సతీష్ పాల్గొన్నారు.

మళ్లీ మొదలైన మోకాలి మార్పిడి సర్జరీలు

- తుంటి ఎముక సర్జరీ విజయవంతం
- జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో కొన్ని రోజులుగా నిలిచిపోయిన మోకాలి మార్పిడి సర్జరీలు మళ్లీ ప్రారంభమైనట్లు జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఆర్థో హెచ్‌ఓడీ డా.రమేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం తుంటి ఎముక(హిప్ జాయింట్) మార్పిడి సర్జరీని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇదే సర్జరీ అయితే ప్రైవేట్ ఆస్పత్రిలో అయితే రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. తుంటి ఎముక మార్పిడి సర్జరీ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా నిర్వహించామని అన్నారు. వైద్యులు మాధవి,శివరామ్ నాయక్, ప్రవీణ్, లాలూనాయక్, ఉదయ్, నరేష్, శరత్ పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు



నిర్వాసితులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

జడ్చర్ల: ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఉదండాపూర్ రిజర్వాయర్ కట్టపై చేపట్టిన రిలే దీక్ష శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా పనులు ఎలా మొదలు పెడుతారని ప్రశ్నించారు.పెరిగిన ధరలతో పోలిస్తే ప్రభుత్వం గతంలో ప్రకటించిన ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఎంతమాత్రం సరిపోదన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ చొరవ తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, జిల్లా నాయకులు జగన్, సత్తయ్య పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

జడ్చర్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వార్డు కౌన్సిలర్ నవనీత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.హెచ్‌ఎం సావిత్రి , సుమలత తదితరులున్నారు.

వాటర్ ప్లాంట్ పనులు నిలిపివేయాలి

జడ్చర్ల: కావేరమ్మపేట శివారులో తమ వ్యవసాయ భూముల సమీపంలో నిర్మిస్తున్న వాటర్‌ప్లాంట్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని రైతులు శేఖర్‌యాదవ్, మల్లేష్, వెంకట్‌రెడ్డి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజావాణిలో అధికారులకు, మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలతకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వాటర్‌ప్లాంట్ ఏర్పాటుతో బోర్లలో నీటిమట్టం పడిపోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

జడ్చర్ల: బాదేపల్లి కూరగాయల మార్కెట్ యార్డులో సోమవారం సీసీ కెమెరాలను ఏర్పాటుచేసినట్లు వార్డు కౌన్సిలర్ శ్రావణి తెలిపారు. ప్రజల భద్రతకు సంబంధించి ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేశామన్నా రు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన కూరగాయల విక్రయదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీనివాస్‌రావు మృతి తీరని లోటు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): టీఎన్‌జీఓ కేంద్ర కమిటీ కోశాధికారి శ్రీనివాస్‌రావు ఆకాల మృతి సంఘానికి తీరని లోటని టీఎన్‌జీఓ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్‌రెడ్డి, చంద్రనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అభివృద్ధి కోసం చేసిన సేవలు ఎప్పటికీ మరువలేమని, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆయన మృతిపట్ల సంతాపం తెలిపి కుటుంబసభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

యన్మన్‌గండ్లలో దంత వైద్యశిబిరం

నవాబుపేట: మండలంలోని ఎస్‌వీఎస్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డెంటల్ కళాశాల విద్యార్థులు దంత పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. జెడ్పీ పాఠశాలలో సైతం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఎంఈఓ నాగ్యనాయక్, డెంటల్ క్యాంప్ ఇన్‌చార్జి జితేందర్, హెచ్‌ఎం వనజ, సీఆర్‌పీ జనార్దన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య మరింత పెంచాలి



నవాబుపేట: గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచాలని మండల ప్రత్యేకాధికారి శంకరాచారి, ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధికారులు, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే ఉపాధి కూలీల సంఖ్య దాదాపుగా 2వేలకు చేరిందని, ఈసంఖ్య మరింత పెంచాలని వివరించారు. ఎండ తీవ్రతను బట్టి ఉపశమనం కోసం టెంట్లు ఏర్పాటుచేయాలని అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏపీఓ జ్యోతి, బద్రునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సమీయుల్లా ఉన్నారు.

ఇంటర్ స్టేట్ కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు జీకే మాస్టర్ షోటోకాన్ కరాటేడూ ఇండియా పట్టణ ఉపాధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. విద్యార్థులకు తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూఅసోసియేషన్ ట్రెజరర్ రామస్వామి పతకాలు, సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు పతకాలు సాధించడంపై జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ జి.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. మాస్టర్ నవీన్‌కుమార్‌ను అభినందించారు.

వ్యాపారులు ముందుకు రావాలి

నవాబుపేట: మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు రావాలని ఎస్‌ఐ విక్రమ్ అన్నారు. సోమవారం వ్యాపార సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన రోడ్డులో ఉన్న వ్యాపార సముదాయాలకు ఇబ్బందులు రాకుండా ఇతర నేరాల అడ్డుకట్టకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకురావాలని ఆయన కోరారు. మాజీ సర్పంచ్ గోపాల్, సంఘం నాయకులు బాల్‌రాజ్, శ్రీనివాస్, వాసుచారీ, కృష్ణయ్య, యాదయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

నేటి నుంచి షబీనా తరావీ

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసం సందర్భంగా జిల్లా కేంద్రం రాయచూర్ రోడ్డులోగల యూనిక్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఈనెల 16వ తేదీ వరకు (ఆరు రోజుల) వరకు షబీనా తరావీ నమాజ్ ప్రార్థనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరావీ నమాజును హాఫిజ్ మహ్మద్ రఫీయోద్దీన్ చేయిస్తారని, మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తరావీ ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

అందరూ సమానంగా ఉన్నప్పుడే అభివృద్ధి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ జరీనాబేగం

మహబూబ్‌నగర్ రూరల్: సమాజంలో అందరూ సమానంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి జరీనాబేగం అన్నారు. బ్రహ్మ మానసిక దివ్యాంగుల పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలో 24 ఏళ్లుగా దివ్యాంగుల కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసి వారికి అన్ని రకాలుగా విద్యాబుద్ధులను నేర్పిస్తున్న పాఠశాల వ్యవస్థాపకులు గన్నోజి చంద్రశేఖర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సీడబ్ల్యూసీ సభ్యుడు విజయ్‌కుమార్, సఖి సీఏ సౌ జన్య, మహిళా శక్తి కోఆర్డినేటర్ అరుణ, డీసీపీఓ న ర్మద, జేజేబీ సభ్యురాలు గిరిజ, భారత వికాస్ పరిషత్ అధ్యక్షుడు భూషణ్ పాండే, ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

మిడ్జిల్: మండలంలోని మసిగొండ్లపల్లి, రాణిపేట్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. జీహెచ్‌ఎం సరస్వతి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్, ప్రభావతి, రాజేష్, నర్సింహ పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇప్పించండి

మహమ్మదాబాద్: హైవే వెడల్పులో నష్టపోయిన వారికి ప్రభుత్వం తరపున నష్ట పరిహారం ఇప్పించాలని తహసీల్దార్‌కు సోమవారం స్థానికులు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఎంతోమందికి పరిహారమిచ్చిన కాంట్రాక్టరు పేదలకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తపరిచారు.

అక్రమ నిర్మాణాలపై ఉదాసీనత ఎందుకు?

- కలెక్టర్ ఆదేశించినా స్పందించడం లేదు
- పలువురు అధికారులు సమావేశానికి గైర్హాజరు
- అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ పుష్పలత, సభ్యులు

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలో అనుమతుల్లేకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా ఎందుకు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని పాలకమండలి సభ్యులు అధికారులపై ధ్వజమెత్తారు. సోమవారం కావేరమ్మపేటలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పుష్పలత అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశానికి కమిషనర్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సారిక హాజరయ్యారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సభ్యులు చైతన్యచౌహాన్, రమేశ్ కమిషనర్‌ను ప్రశ్నించారు. అన్ని అనుమతులున్నా కేవలం రాజకీయ ఒత్తిళ్లతో తన నిర్మాణాన్ని కూల్చిన అధికారులు అనుమతుల్లేని అక్రమనిర్మాణాలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కౌన్సిలర్ నందకిషోర్ ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలపై కలెక్టర్ ఆదేశించినా స్పందించడం లేదని కమిషనర్‌ను ప్రశ్నించగా విచారించి చర్యలు చేపడుతామని ఆయన తెలిపారు. ఎస్టీ కాలనీలకు సంబంధించి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కౌన్సిలర్ చైతన్య చౌహాన్ కోరారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులొచ్చే అవకాశముందని, బోర్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలన్నారు. కొత్తగా 10 మోటార్లు కొనుగోలు చేసేందుకు ప్రతిపాదిస్తున్నట్లు చైర్‌పర్సన్ పుష్పలత వివరించారు. సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని త్వరగా పూర్తి చేయాలని, మహనీయుల విగ్రహాల తొలగింపుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. 11వ వార్డులో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచనల మేరకు రూ.10 లక్షలు సీసీరోడ్డుకు కేటాయించడంపై కొందరు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని కమిషనర్ చెప్పారు. ముఖ్యవిభాగాలకు సంబంధించిన అధికారులు సమావేశానికి గైర్హాజర్ కావడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. గుర్తుతెలియని మృతదేహాలను తరలించే జవాన్‌కు రూ.వేయి చొప్పున ఇస్తారని, కొంతకాలంగా ఆయా బిల్లులు ఇవ్వడంలేదని కౌన్సిలర్ సతీష్ సభ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ లక్ష్మారెడ్డి సభ్యులకు హామీ ఇచ్చారు.